# సౌలు
# ఆనందమయమైన ఆరంభం - పాతాళపు అంతానికి

మొదటి సమూయేలులో ఉన్న అనేక మందిలో విశిష్టంగా కనిపించే యువ రక్షకుడున్నాడు. వాడు బెన్యామీను గోత్రానికి చెందినవాడు. వాడు మొదట తన తండ్రికి చెందిన తప్పి పోయిన గార్దాభాలను వెతకడానికి వచ్చినట్టుగా కనిపిస్తాడు (9:3–5). వాడు బాల్యంలో చాలా వినయవంతుడు, ఇతరులపట్ల అక్కరగలవాడు. అటు తరువాత సంవత్సరాలలో అతడు చాలా మారిపోయాడు. అతడు విజయాన్ని పొందేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. ఘోరంగా విఫలుడయ్యాడు. వాడి జీవితాన్ని ఈ కింది సంఘటనతో సరిగ్గా వివరించవచ్చు.

ఒక నిర్దేవుల సమాజానికి ప్రతి ఆదివారం ఉదయం అందరూ కలిసి మతాన్ని హేళన చేస్తూ, దేవదూషణను చేస్తూ పరస్పరం ప్రోత్సహించుకునే అలవాటుండేది. బైబిలు పుస్తకాలను తగుల బెట్టేంతవరకూ వచ్చారు! భయంకరమైన వారి సహవాసంలోనికి యిటీవల ఒక యువకుని చేర్చుకున్నారు. ఈ యువకుడు గొప్ప మతపరమైన ప్రయోజనాలు కలిగిన వాడిగా పెరిగాడు. ఆ నిర్దేవుల కలయికకు అతడు హాజరవ్వడంతోనే అతడు తన బైబిలును మంటలో వేసి, యికను ఎన్నడు సంఘ ఆరాధనలకు వెళ్లనని వాగ్దానం చేశాడు. తరువాత త్వరలోనే అతడు చాలా జబ్బుపడ్డాడు. ఆ స్థితిలో ఉన్న అతనిని ఒక క్రైస్తవుడు దర్శించాడు. అతడు చాలా కలతచెందినవాడుగా కన్పించాడు. మారుమనస్సు పొందునట్లు అతనిని ఉత్సాహపరచడానికి ఆ క్రైస్తవుడు ప్రయత్నించాడు, దేవుని కనికరాన్ని గూర్చి అతనికి వివరించాడు. అప్పుడు ఆ యువకుడు, "కనికరమును గూర్చి నాతో ఎందుకు మాట్లాడతావు? అది చాలా ఆలస్యమైపోయిందని నేను చెప్పుతున్నాను! ఒకప్పుడు నేను ప్రార్థించగలిగాను, యిప్పుడు ప్రార్థించలేను. నేను యికను ప్రార్థించను!" అని బదులిచ్చాడు. అది సంభవించిన తరువాత త్వరలోనే అతడు చనిపోయాడు. దేవదూషణ చేయడానికి తనను ప్రేరేపించినవారిని చాలా ఘోరంగా శపిస్తూ చనిపోయాడు. చనిపోతున్నప్పుడు అతని పలుకులు యివి: "నా బైబిలు! ఓ, నా బైబిలు!"

ఆ యువకునికిని రాజైన సౌలుకును కలిగిన విపత్తు ఒక్కటే - మత భ్రష్టత్వం. మత భ్రష్టత్వం నిజమైన ఆపదగా లేఖనాల్లో చిత్రింపబడింది (హోషేయ 4:16; యెషయా 1:4; ప్రకటన 2:4; 1 తిమోతి 6:10, 21; 2 తిమోతి 4:4). రక్షణనుండి తొలగిపోడాన్ని గూర్చి మాట్లాడినట్టు నాల్గు పుస్తకాల్లో కన్పిస్తుంది.

బైబిల్లో ఉండే మరి ఏ యితర పుస్తకం కంటెను ఎక్కువగా, యిర్మీయా "వెనుకకు మరలుటను" గూర్చి ఉపయోగిస్తుంది.
కొందరు హోషేయాను "వెనుకకు మరలినవారి సువార్త" అని పిలిచారు.
గలతీయులకు – అస్థిరులుగా పేరుపొందినవారికి వ్రాయబడింది (గలతీ. 1:6; 5:7).
హెబ్రీయులకు – క్రీస్తునందలి విశ్వాసాన్ని వదలుకొనే శోధనలో ఉన్నవారికి వ్రాయబడింది.

పాత నిబంధనలోని (మత) భ్రష్టత్వానికి సౌలు స్పష్టమైన ఉదాహరణగా కనబడతాడు. తాను ఎక్కడ బలవంతుడుగా ఉండాలో అక్కడ బహు బలహీనుడైనట్టు రుజువు చేసికొన్నాడు (15:17). తన వినయమును బట్టి అతడు ఏరుకోబడ్డాడు. అయినప్పటికి, రాజు యొక్క అంతస్థు అతని వినయాన్ని గర్వంగా రూపొందించి, అతని నాశనానికి త్రోవతీసింది. అలాటి విపత్తు మన శ్రద్ధను ఆకర్షించడానికి తగినట్టుగా ఉంటుంది. ఎందుకంటె – ఒక దైవజనుని భక్తి శిఖరములనుండి, నాస్తికత్వపు అడుగు భాగాల్లోనికి పడిపోయిన స్థితిని జాగ్రత్తగా గుర్తించాలి.

## సౌలు చరిత్ర: ఆనందదాయకమైన ఆరంభం

కీషు కుమారుడైన సౌలు పెరుగుదలను చరిత్ర వివరంగా పేర్కొంటుంది. 9:2లో విధేయుడైన కుమారుడుగా అతడు పరిచయం అవుతాడు; తన తండ్రి ఆజ్ఞలను అతడు శిరసావహిస్తున్నట్టు కనిపిస్తాడు. తప్పిపోయిన గాడిదెలను వెదకే అతని ప్రయత్నం విఫలమయ్యింది. గనుక అతడు చివరిగా సహాయం కొరకు సమూయేలు వైపు వెళ్లడానికి తిరిగాడు. సమూయేలు సౌలుతో మాట్లాడగా, ఇశ్రాయేలు కోర్కె మేరకు అతడు వారికి రాజుకాబోతున్నట్టు తెలుస్తుంది. దాన్ని నమ్మడానికి సౌలు నిరాకరించాడు (9:21). మరునాడు, తన యింటికి వెళ్లడానికి సౌలు సిద్ధపడగా, అతడు "మనస్సు మార్చు కున్నాడు" (10:9). అతడు మరొక వ్యక్తి అయ్యాడు, దేవుడు తనను రాజుగా ఎన్నుకున్నాడన్న సంగతిని స్థిరపరచడానికి మూడు గురుతులు (సూచనలు) నిర్ణయిస్తాయని తన యింటికి బయలుదేరిన సౌలుతో సమూయేలు తెలిపాడు. గాడిదలు దొరుకుతాయి (10:2); ఆరాధనకు వెళ్లే ముగ్గురు మనుష్యులనుండి సౌలు ఒక బహుమానం పొందుతాడు (10:4); సౌలు ప్రవక్తలలో చేరిపోతాడు (10:6). ఈ మూడు వాస్తవాలు సంభవించినప్పటికిని సౌలు ఇశ్రాయేలీయులకు రాజుగానుండ దేవుడు ఇష్టప డ్డాడన్న సందేశాన్ని అతడు నమ్మలేకున్నాడు (10:16).

మిస్పా వద్ద ఇశ్రాయేలు సమాజ కూడికలో బహిరంగంగా క్రొత్త రాజు ఏర్పరచబడడం, సౌలును రాజుగా ప్రకటించడం జరిగింది (10:17–27). కిరీటాన్ని అందుకొనడానికి సౌలు ఎదురులేని అభ్యర్థిగా ముందుకు రాలేదు. అతని మర్యాద, వినయము చాలా మనోహరంగా వ్యక్తమయ్యాయి (10:22). అతడు నియమింప బడినప్పుడు, అతని వినయం అతనికి విమర్శను ప్రశంసనీయంగా ఎదుర్కునే సామర్థ్యం కలిగించింది (10:27బి). అతడు పగ తీర్చుకోవాలనికాని కసి తీర్చుకోవాలని కాని అనుకోలేదు. అతడు తనను తాను చాలా బాగా నిగ్రహించుకున్నాడు. వాస్తవంగా లేఖనం

ఏమన్నదంటే – "చెవిటివాడైనట్టు అతడు బదులిచ్చాడు." అతడు ఆ మాటల నెప్పుడూ పలకనట్టే వ్యవహరించాడు.

మకుటధారియైన తరువాత కూడా సౌలు వినయంగానే ఉన్నాడు – ఇంటికి వెళ్లి అతడు దుక్కి దున్నాడు! (10:26; 11:5). యువకుడుగా అతడు గుర్తింపగల వ్యక్తిత్వం కలవాడు. అతడు అహంభావాన్ని అదుపులో ఉంచుకొన్నాడు. పగ తీర్చుకోవాలనే దురాశను లోబరచుకున్నాడు. ఆడంబరానికి, ఘనతకు సంబంధించిన కోర్కెలను జయించాడు. అతన్ని అభినందించకుండ ఉండలేం!

నూతనంగా నియమింపబడిన రాజు సంసిద్ధత యాబేష్గిలాదు వద్ద చక్కగా పరీక్షింపబడింది (11:1–15). యెఫ్తా అమ్మోనీయులను అణచి సుమారు వంద సంవత్సరాలు ఔతుంది. ఇప్పుడు వారి యాబేష్గిలాదును ముట్టడివేశారు. ఆ పట్టణ వాసులకు కడపటి తీర్పు చెప్పబడింది (11:2). యుద్ధం, నగరవాసులను నిస్సహాయులను చేసింది. అసహాయులయిన వారు గతంలోని రక్తసంబంధాన్ని బట్టి గిబియాకు సహాయానికి వెళ్లారు (న్యాయాధి. 20, 21). ఆ రిపోర్టు సౌలుకు వచ్చి చేరింది. అతడు సైన్యాన్ని సమకూర్చుకొని వచ్చి, అమ్మోనీయులను ఓడించాడు (11:6–11). సౌలు అధికారంలో పైకిరావడం అద్భుతమైన ఆరంభంగా ఉంది, ఇశ్రాయేలంతటిలో ఆనందం పొంగి పొరలింది (11:15).

## సౌలు చరిత్ర: విచారకరమైన పతనం

అతడు దేవునియందు భక్తి కలిగి ఉన్న కారణాన దేవుని ప్రజలపై రాజుగా సౌలు ఆరంభపు వృత్తి విజయవంతంగా కొనసాగింది (11:13). కొన్ని సంవత్సరాలు గడచిన మీదట అతని హృదయం మారిపోనారంభించింది. ఆ మార్పుతో ఇశ్రాయేలులో కూడా మార్పులు వచ్చాయి. 1 సమూయేలులో సౌలు పతనం స్పష్టంగా చిత్రీకరించబడింది.

ఇశ్రాయేలుపై ఫిలిష్తీయులు దండెత్తినప్పుడు, నాశనానికి తొలి సూచన కన్పించింది (13:6). పిరికితనంగల ఆత్మ దేశమంతటిని అలుముకొంది, శత్రువుని ఎదుర్కొనడానికి రాజు సైన్యాన్ని పోగుచేశాడు. సమూయేలు వచ్చి బలియర్పించునట్టుగా సౌలు ప్రవక్త కొరకు వేచియున్నాడు, కాని సమూయేలు యింకను రాలేదు. రోజులు గడుస్తున్నకొలది, సైన్యంలోనివారు వదలి వెళ్లిపోడాన్ని బట్టి సైన్యపు అధికారులు నీరసించారు (13:7, 8). సౌలు తానే జంకాడు. మరియు అతడు స్వయంగా తానే బలియర్పించాడు (13:9). సమూయేలు రాజును గట్టిగా గద్దించాడు. అయినా ప్రవక్త మాటను అంత గట్టిగా సౌలు పట్టించుకోలేదు (13:10, 11, 13, 14). దానితో సౌలు పతనం ఆరంభమయ్యింది.

సౌలు నాశనానికి సంబంధించిన తరువాత సూచన 15:9లో ప్రత్యక్షపరచబడింది:

> సౌలును జనులును కూడి అగగును, గొఱ్ఱెలలోను ఎడ్లలోను క్రొవ్విన గొఱ్ఱెపిల్లలు మొదలైన వాటిలోను మంచి వాటిని నిర్మూలము చేయక కడగానుంచి, పనికిరాని నీచపశువు లన్నిటిని నిర్మూలముచేసిరి.

యిక్కడ అతడు దేవునిచే నిరాకరింపబడ్డాడు. ఫిలిష్తీయుల దండయాత్ర జరిగిన పలు సంవత్సరాల తరువాత సంగతి యిది. అంతేగాక, ఈ సంవత్సరాల కాలంలో సౌలు ఆశ్చర్యకరమైన విజయాన్ని పొందాడు. అతని సైన్యం అధికమయ్యింది, ఎక్కువ యుద్ధాలను గెలిచాడు. అతని ఇంట్లో అపారమైన సంపద ఉంది. అతడు అన్నమాట సంపూర్ణమైన చట్టంగా మారింది (14:47, 48). అయితే సౌలు 15:9లో ఘోరంగా పరాజయం పొందాడు. అమాలేకీయులను సమూల నాశనం చేయ నిరాకరించిన పిమ్మట, లేఖనాల్లో ఎన్నడు యివ్వనంత తీక్షణమైన గద్దింపునకు అతడు గురయ్యాడు. సౌలుకు దేవుడు ఎంత చేసినా, దురాశ అతని పాలించి కడకు అతనిని నాశనం చేసింది. అతనిని వశపరచుకున్న స్వభావం దేవునికి విరోధంగా తిరుగుబాటు చేయడమే (15:23).

తన పాపాన్ని గూర్చిన సౌలు యొక్క ప్రతిపాదనలు యథార్థమైనవి కావు. ఎందుకంటె, తన కట్టుబాటులో ఉండాలనే వాంఛకు అవి ముసుకువేశాయి (15:25-30). ప్రజల పట్ల అతడు మంచిగా ఉండగోరాడు. ఇలా ఉండడానికిగల ఒకే మార్గం సమూయేలుతో స్నేహంగా ఉన్నట్టు కన్పించడం. అతనికి వినయం పోయి స్వార్థపరమైన అతిశయం అతన్ని ఆవరించింది!

దానికి వచ్చిన ప్రతిఫలం దుఃఖ భరితమైనది:

> అంతట యెహోవా సమూయేలుతో ఈలాగు సెలవిచ్చెను - ఇశ్రాయేలీయుల మీద రాజుగా ఉండకుండ నేను విసర్జించిన సౌలునుగూర్చి నీ వెంతకాలము దుఃఖింతువు? నీ కొమ్మును తైలముతో నింపుము, బేత్లెహేమీయుడైన యెష్షయియొద్దకు నిన్ను పంపుచున్నాను, అతని కుమారులలో ఒకని నేను రాజుగా నియమించుదును (16:1).

చక్కని హెబ్రీ ప్రసంగంలో, ఆయన అనుమతించిన దాన్ని సర్వశక్తుడు జరిగించినట్టు కొన్ని సార్లు చెప్పబడింది. సౌలుతో జరిగింది అదే (యోబు 1:6-12; లూకా 22:31తో పోల్చి చూడు). తిరుగుబాటు మార్గాన్ని కోరుకొని, సౌలు దేవుని తిరస్కరించాడు. ఇప్పుడు తనను నడిపించడానికి, తన నిర్ణయాలను వశపరచుకొనడానికి దుష్టత్వానికి అతడు లొంగిపోయాడు.

సౌలు ఆపదను గుర్తించినట్టున్నాడు. తన అవిధేయతకు నష్టపరిహారంగా అతడు యోగ్యతను సంపాదించు పనులు జరిగించడంవలన దేవుని సహాయం తిరిగి పొందడానికి ప్రయత్నించాడు. దేవుని శిక్షావిధిని సమన్వయం చేయడానికి సౌలు రెండు పనులు జరిగించాడు. అతడు గిబియోనీయులను లయపరచ ప్రయత్నించాడు (2 సమూ. 21:2తో పోల్చి చూడు). అత్మసంబంధమైన వాటికి విరోధంగా చట్టం చేశాడు (28:9). సౌలు యొక్క రాజ వంశం తొలిగించబడింది. అతని హృదయంలో ఉన్న కుళ్లు అతని చుట్టునున్న దానినంతటిని చెరిపింది. ఇతర రాజులవలె శోభాయామాన మకుటాన్ని అతడు ధరించాడు (2 సమూ. 1:10); తన ఆస్థానంలోని డాంబిక జీవనాన్ని అతడు పెంచాడు (2 సమూ. 1:24); తన కుమారులకు పేర్లు పెట్టడంలో యెహోవా దేవుని ఆరాధనతో పాటు బయలు దేవతారాధనను యుక్తిగా జోడించాడు; మరియు అతడు ఉపపత్నులను ఉంచుకొన్నాడు.

సౌలు పతనం తరచుగా అతన్ని నిరాశా నిస్పృహలకు లోను చేసింది. సితారా

వాద్యం వల్ల అతనికి శాంతి కలిగించడానికి ఒక గొర్రెలు మేపుకునే కుర్ర పిల్లవానిని పెట్టారు (16:19). అయితే యువకుడైన దావీదు ప్రసన్నత సౌలు హృదయంలో విషపు భావాలను కలిగించింది. గొల్యాతు యొక్క మరణానంతరమైతే, సౌలు యొక్క తలంపులలో అసూయ, ద్వేషము అనేవి చోటు చేసికొన్నాయి. వెర్రి కోపంతో దావీదును చంపాలని సౌలు ప్రయత్నించాడు. మొదట్లో, మోసాన్ని ఉపయోగించి, ఫిలిష్తీయులచేత అతడు దావీదును చంపించజూచాడు (18:21). చివరిగా, తానే దావీదుకు వ్యతిరేకంగా బహిరంగమైన చర్య తీసికొన్నాడు (19:1). దావీదుకు వ్యతిరేకంగా సౌలు భయంకరమైన ద్వేషాన్ని ఆపగలిగింది ఏదీ లేదు. రెండు మార్లు రాజు యొక్క ప్రాణం గండం తప్పింది. అయితే దావీదు కనికరం సౌలు మీద ఎలాంటి ప్రభావాన్ని చూపలేకపోయింది. ద్వేషంచేత దహించుకుపోయే దుస్థితికి సౌలు దిగజారాడు, సౌలు యొక్క వినయము హరించి పోయింది. క్రమేణా, అతని తొలి సంవత్సరాలలో ఉన్న సంతోషం అతని కడపటి సంవత్సరాలలోని అంధకారంచేత కలుసుకుని పోయింది.

ఏన్దోరు సంఘటన జరిగే సమయానికి అతని పతనం దాదాపుగా ముగిసిపోయినట్టే (28:3-25). గొల్యాతు చంపివేయబడి సంవత్సరాలు గడిచిపోయాయ్. సౌలు వ్యూహంనుండి తప్పించుకొని దావీదు సంవత్సరాల తరబడి తిరుగుతున్నాడు. మరోసారి సౌలుకు పురాతన శత్రువులైన ఫిలిష్తీయులు ఇశ్రాయేలుపై క్రొత్త దండయాత్ర మొదలుపెట్టారు. యెజ్రెయేలు మైదానంలో ఉన్న వర్తక మార్గాన్ని ఫిలిష్తీయులు చేజిక్కించుకోవాలని అనుకున్నట్టు ఉన్నారు. సౌలు తన సైన్యాలను గిల్బాలో దింపాడు. అయితే అతని ధైర్యం పోయింది (28:5ను; యోబు 23:8తో పోల్చి చూడు). అతనికి సహాయం అవసరమయ్యింది. అయితే దేవుడు మౌనం వహించాడు. సలహా కొరకు రాజు ఒక సోదెకత్తె వద్దకు వెళ్లాడు (28:6, 7). అయితే అతని మోసం బయటపడింది, సమూయేలు దర్శనముకు ఆమె కంగారుపడిపోయింది (28:12). ప్రవక్తయైన సమూయేలు సౌలుకు ఏ నిరీక్షణగాని, ఆదరణగాని యివ్వలేకపోయాడు. ముంచుకొని వస్తున్న వినాశనంనుండి సౌలును తప్పించేది ఏదీ లేదు (28:16). సమూయేలు సందేశం వినగానే సౌలు కూలిపోయాడు (28:20). సోదెకత్తె యొక్క మట్టి యింటిపై సౌలు మనస్సు ఉంచినప్పుడు, అతని మనస్సులోనుండి ఎట్టి ఆలోచనలు దూసికొని పోయి ఉంటాయో యోచింప ప్రయత్నించు. దేవుడైన యెహోవామీద తిరుగుబాటు చేసిన నాటినుండి అప్పటివరకు జరిగిన ప్రతిదీ క్రమ క్రమంగా అతడు గుర్తు చేసుకున్నాడు.

గిల్బోవ పర్వతం వద్ద సౌలు పతనం సంపూర్తి అయింది (31:1-6). రెండు సైన్యాలు ఒకదానితో ఒకటి తలపడ్డాయి; యుద్ధం ఆరంభమయ్యింది. సౌలు సైన్యం ఓడింపబడింది, ఆ పర్వతం రక్తమయమయ్యింది. సౌలు గాయపరచబడినప్పుడు, తాను పట్టబడేదానికంటె ఆత్మహత్య చేసికొనడం మేలని యెంచి, ప్రయత్నించినా, కుదరలేదు. అతడు ఒక అమాలేకీయునిచేత చంపబడ్డాడు (2 సమూ. 1:1-10). కృతజ్ఞతగల యాబేష్గిలాదు పౌరులు సౌలు మరియు అతని కుమారుల మృత దేహాలను పూడ్చివేశారు (31:13).

## సౌలు చరిత్ర: బలహీన ప్రభావం

సౌలు జీవితం వివరణలో, అతని ఆపదకు ఒకే ఒక విషయం బాధ్యత వహిస్తుంది అది అతని స్వార్థం. తన కన్నులను దేవునిపైనుంచి తొలగించి తనమీదనే ఉంచాడు. స్వార్థము పతనానికి నడిపి చివరిగా అతన్ని చంపింది (11:13తో 15:12; 18:8; 15:7ల మధ్య గల తారతమ్యాన్ని చూడు).

స్వార్థం ఏలుబడి చేసినప్పుడు, అహంభావం, పగ, భౌతికవాదం అనేవాటిమీద సౌలుకుగల స్వాధీనం తప్పిపోయింది. అహం ఏలుబడి చేసేలా అతడు అనుమతించి నప్పుడు, కోపంగలవాడుగా చింతలో ఉన్నవాడుగా అయ్యాడు. హంతకుని హృదయాన్ని అతడు ప్రకటించాడు, పాతాళ సంబంధియైనట్టు మరణించాడు (యెషయా 56:11; యిర్మీయా 17:11).

గిల్గాలులో బలియర్పించేలా స్వార్థం సౌలును నడిపించింది (13:9). అతడు దేవుని సేవింప నిరాకరించి, నిరంకుశుడయ్యాడు. దేవుని మీద విశ్వాసంతో ఆనుకోలేకపోయాడు. సౌలు దృష్టిలో, దేవుడు నెమ్మదిగా పని చేసేవాడైయున్నట్టు గోచరించాడు. అందువలన, వేచియుండడంలో అతడు విసిగిపోయాడు (సామె. 30:8, 9).

తన లోపాలను సమర్థించుకునేలా స్వార్థం సౌలును నడిపించింది. 1 సమూ. 13:11, 12 యిలా అంటుంది:

> సమూయేలు అతనితో – నీవు చేసిన పని యేమని యడిగెను. అందుకు సౌలు – జనులు నా యొద్దనుండి చెదరిపోవుటయు, నిర్ణయకాలమున నీవు రాకపోవుటయు, ఫిలిష్తీయులు మిక్మషులో కూడియుండుటయు నేను చూచి – ఇంకను యెహోవాను శాంతిపరచకమునుపే ఫిలిష్తీయులు గిల్గాలునకు వచ్చి నామీద పడుదురనుకొని నా అంతట నేను సాహసించి దహనబలి అర్పించితిననెను.

ఒక మాటలో చెప్పాలంటే, "నేను చేయదలచుకోలేదు కాని, కుదరలేదు, పరిస్థితులు నన్ను బలవంతపెట్టాయని" సౌలు అన్నాడు! (15:19–21; మీకా 2:2 పోల్చి చూడు).

సౌలు స్వార్థం అమాలేకీయులను వదిలేట్టు చేసింది (15:9). తన కొరకు మేలైనవాటిని ఉంచుకొనేలా అతనిలో పేరాశ పెరిగింది (15:19). గిల్బోవ కొండమీద సౌలు అమాలేకీయుని ఖడ్గంవలననే నశించాడు! స్వార్థం ఎల్లప్పుడు నష్టాన్ని కలిగిస్తుంది (మత్తయి 16:26; హగ్గయి 1:6).

అతని ఆరంభ దినాల్లో, సౌలు స్వార్థాన్ని స్వాధీనంలో ఉంచుకొన్నాడు. మెల్ల మెల్లగా, స్వాధీనం తప్పిపోనారంభించింది, చివరికి స్వార్థంపై స్వాధీనాన్ని అతడు కోల్పోయాడు. అప్పుడు అతడు దుఃఖకరమైన సంఘటనలను ఎదుర్కొన్నాడు! (15:19బి; సామె. 16:18).

## సౌలు చరిత్ర: ముఖ్యమైన పాఠాలు

దేవుని మీద "ఆనుకొనడం" చాలా ముఖ్యం! జీవనగతిని నీ చేతుల్లోకి ఎన్నడూ తీసికోవద్దు.

భ్రష్టుడైన తండ్రి ప్రభావం ఎంత గొప్పగాను దుఃఖ సహితమైనదిగాను ఉంటుందో (31:2; 2 సమూ. 21:1-10). అతని చర్యలవలన, సౌలు కుటుంబమంతా బాధపడింది.

భ్రష్టులై దేవుని వద్దనుండి తొలగిపోవడం ఎంత భయంకరమైన-ఎల్లప్పుడు ఉండే నిజమైయుంటుంది (17:11; 18:12; 28:16). మనకందరికి సహజమైన శోధనలు ఎదురౌతాయి, శోధనలు ఎంతో పులకరింపును కలిగిస్తాయి, అయితే వాటికి అప్పగించు కోకుండా అంతరంగపు పురుషుడు అనుదినం సిలువవేయబడవలసి ఉంటాడు.

విశ్వాస భ్రష్టుడైనవాని హృదయం ఎంతగా కరుడు కట్టుకొనిపోతుందో (24:17). నటించే మారుమనస్సు సాధ్యం కావచ్చు, అయితే దుష్ట హృదయాన్ని అది పాపపు లోతులలోనికి నడిపిస్తుంది!

స్వార్థం ఎంత శోధనగా ఉంటుందో, స్వార్థపరత్వం అంత వినాశనకరంగా ఉంటుంది (1 కొరింథీ. 10:24; 2 కొరింథీ. 5:15ఎ; సామె. 1:19; 15:27). (లేక స్వార్థంగా ఉండాలని ఎంత శోధనగా ఉంటుందో, కాని స్వార్థమనేది ఎంత నాశనకరంగా ఉంటుందో!)

మనము సమస్తమైన “అమాలేకీయులను” మన వద్దనుండి తొలగించాలి! ఇది చేయడంలో మనం విఫలమౌతే, మనలను నాశనం చేయడానికి వారు లేచివస్తారు! కొలస్సీ. 3:5-9 మనలను యిలా హెచ్చరిస్తుంది:

> … ఇప్పుడైతే మీరు, కోపము, ఆగ్రహము, దుష్టత్వము, దూషణ, మీ నోట బూతులు అను వీటినన్నిటిని విసర్జించుడి. ఒకనితో ఒకడు అబద్ధమాడకుడి; ఏలయనగా ప్రాచీన స్వభావమును దాని క్రియలతో కూడ మీరు పరిత్యజించి …

## ముగింపు

మృత సముద్రపు తీరాన ఉన్న అనేక ఉత్తమమైన చెట్ల శేష భాగాలు యొర్దాను నదీ ప్రవాహంవలన ఉప్పు నీటిలోనికి కొట్టుకొని పోయాయి. దేవునిచే నాటబడి ఫలములు, నీడ యివ్వడానికి ఉద్దేశింపబడిన జీవితాలను ఈ చెట్లు జ్ఞాపకం చేస్తాయి. అయితే అవి వాటి అసలైన ఉద్దేశాన్ని నెరవేర్చవు. అవి చచ్చి వ్యర్థంగా పడి ఉంటాయి. దీని కంటెను అధికంగా విషాదాంతమైన జీవితాల జాబితాను తయారు చేస్తే, ఆ సంఖ్యలో సౌలు ప్రధానుడైయుంటాడు!

సౌలు పరిపాలన చాలా రమ్యంగా ఆరంభమయ్యింది. అయితే స్వార్థపరత్వమనేది అతని మూర్ఖ స్వభావానికి, అవిధేయతకు, గర్వానికి దారితీసింది. అతడు తన వెనుక విడిచి వెళ్లింది న్యాయమైనదిగా ప్రఖ్యాతిచెందిన రాజ వంశాన్ని స్థాపించిన రూపు కాదు. అతని రాజ వంశం - “శిథిలమైనదియు దుర్నీతికి సంబంధించినదియునైయుంది.” యథార్థమైన హృదయాలన్నీ జాగ్రత్తపడాలి. సౌలుకు కలిగిన పతనాలు కలిగియు, అతడెక్కడ తప్పిపోయాడో అక్కడ మనం విజయం సాధిస్తాం అనుకుంటే, అట్టివారందరి కొరకు “గిల్బా” వేచియుంటుంది (1 కొరింథీ. 10:12).